# సింగిల్ పేజీ కథలు

## వాస్తవం

ఉద్యోగరీత్యా నేను విజయవాడలో ఉంటున్నాను. ఆ రోజు ఆఫీసుకు వెళ్లేసరికి ఒంగోలులో ఉంటున్న అమ్మ వద్ద నుండి కబురందింది. అప్పుడే ఆఫీసుకు ఫోన్ చేసి నన్ను అర్జెంటుగా బయలుదేరి ఒంగోలుకి రమ్మందని.

'మా బంటీ ఇంకా ఇంటికి చేరలేదు' అదీ విషయం.

వారం రోజుల కిందట నేను ఒంగోలులో అమ్మవాళ్ల ఇంటి వద్ద ఉన్నప్పుడు వాడి ప్రవర్తన బాగోలేదని తెలిసి నేను మందలించినందుకే వాడు ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అలా అలిగి నా ఎదురుగా ఇంట్లోంచి వెళ్లిపోయినందుకు ఇంకా ఇంటికి తిరిగి రాలేదుట.

ఆ బంటీ మరెవరో కాదు నా తర్వాత పుట్టిన నాకున్న ఒకే ఒక్క తమ్ముడు. వాడికి ఇరవై రెండేళ్లు.

బంటీ మొదట్నుంచీ మొండి ఘటమే. రెండేళ్ల కిందట నాన్నగారు పోయారు. ఆయన పోయేంతవరకూ కూడా ఆయన వాడి గురించే బెంగపడేవారు. చెప్పిన మాట వినడు. ఊరి తగవులన్నీ ఇంటిమీదకు తెస్తాడు. ఏపాటి మందలించినా చాలు అంతెత్తున లేస్తాడు.

చదువులో కూడా వెనకడుగే.

చదువూ, సత్ప్రవర్తన లేని వాడిని చూసి నాన్నగారు బ్రతికున్నన్నాళ్లు చాలా మదనపడేవారు. అమ్మ ఈనాటికీ బాధపడుతూనే ఉంది. ఒక విధంగా వాళ్లిద్దరి అతిగారాబం వల్లే వాడలా తయారయ్యాడు. మా ఇంట్లో వాడు కోరిందల్లా చెయ్యడం, అడిగినదల్లా ఇవ్వడంతో అదో అలవాటుగా మారి మంచీ చెడూ తెలియక చివరికి ఎందుకూ కాకుండా పోయాడని నా అభిప్రాయం.

నాన్నగారు సర్వీసులో ఉండగా పోవడంతో ఆయన ఉద్యోగం వారసత్వంగా నాకు వచ్చింది. పోస్టింగ్ విజయవాడలో ఇచ్చారు.

ఉద్యోగరీత్యా నేను ఒక్కడ్నే విజయవాడలో ఉన్నా, సొంత ఇల్లు, సొంత ఊరు అవ్వడం చేత అమ్మా, తమ్ముడూ ఒంగోలులోనే ఉంటున్నారు.

నాన్నగారు పోయాక బంటీ నా చేతుల్లో పడ్డాడు. వాడి ఆటల్ని నేను సాగనివ్వలేదు. వాడికి మొదట్నుంచీ నా దగ్గర కాస్త జంకుంది. నాన్నగారు పోయాక ఆ జంకుని కాస్త భయంగా మార్చారు. దాని ఆధారంగా చేసుకుని వాడిని సక్రమమైన మార్గంలో పెట్టేందుకు సామభేద దండోపాయాలన్నీ ఉపయోగించాను. దాంతో బంటీకి ఏ దారీ తోచక ఇప్పుడు ఓ కొత్త పద్ధతిని అవలంబిస్తున్నాడు. గట్టిగా ఏదైనా అంటే చాలు ఇంట్లోంచి ఒకటి రెండు రోజులు మాయం అయిపోతాడు. ఎక్కడెక్కడో తిరిగి ఉన్నంతవరకూ జేబులు ఖాళీ చేసుకుని ఆ తర్వాత నేను లేని సమయం చూసి ఇంటికి చేరుతున్నాడు.

ఈమధ్య వాడికి సిగరెట్లు, పాన్‌పరాగ్‌లే కాకుండా ఇతరత్రా చెడ్డ అలవాట్లు కూడా అబ్బినట్లున్నాయి. వారం రోజుల కిందట నేను ఇంటికి వెళ్లినప్పుడు ఆ విషయం



నా దృష్టిలోకి వచ్చింది. అందుకే వాడిని కాస్త కఠినంగానే మందలించాను.

"నీకెప్పుడు బుద్ధొస్తుంది ఇరవై రెండేళ్లు వచ్చాయి. నీ తోటి వాళ్లంతా చదువుకుంటూ చిన్నదో, పెద్దదో ఉద్యోగాలు చేసుకుంటూ చక్కగా బతుకుతున్నారు. నువ్వు మాత్రం అటు చదువూ లేక ఇటు ఉద్యోగమూ లేక అడ్డమైన వ్యసనాలూ నేర్చుకుని బలాదూర్‌గా తిరుగుతున్నావు. నాన్నగారూ లేరు, అమ్మ చూస్తే నిన్నేం అనలేదు. నేనేదైనా అంటే పౌరుషం. మరెలా బాగుపడతావు? నీ జ్ఞానం నీకులేదు. ఒకరు చెప్తే వినవు. పైసా సంపాదన లేదు గానీ దిక్కుమాలిన ఆ వ్యసనాలొకటి! చెట్టంత ఎదిగి కూడా నీ వ్యసనాల కోసం మా దగ్గర చెయ్యి జాపేందుకు నీకు సిగ్గనిపించడం లేదూ? ఇకపై పైసా అందకుండా చేస్తాను. నీ బతుకు నువ్వు బతకడం నేర్చుకో" అంటూ కాస్త తీవ్రంగానే మందలించాను.

నేనలా తిట్టేసరికి వాడు ముఖాన్ని ధుమధుమలాడించుకుంటూ నా ఎదురుగానే విసురుగా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. మర్నాడు నేను బయలుదేరుతున్నప్పుడు కూడా పత్తా లేడు.

"వీడేమై పోయాడ్రా" ఆందోళన పడింది అమ్మ.

"ఎటు పోతాడ్లే అమ్మా! ఊర్లోనే ఎక్కడో తిరుగుతూ ఉంటాడు. నేనిలా బస్సెక్కడం చూశాక వాడలా దొడ్డిదారమ్మట ఇంట్లోకి జొరబడతాడు. నువ్వనవసరంగా కంగారు పడకు" అంటూ అమ్మకు ధైర్యం చెప్పి నేను విజయవాడ బయలుదేరాను.

ఆ రోజు నేనన్న మాటలకు నా ఎదురుగానే విసురుగా ఇంట్లోంచి వెళ్లిపోయిన బంటీ ఇంకా ఇంటికి తిరిగి రాలేదంటూ అమ్మ బెంగపడి నాకు కబురు పెట్టింది. తప్పదు కదా!

ఆ రోజు సాయంత్రం ఆఫీసులో పని ముగించుకుని మర్నాటికి సెలవుచీటీ రాసిచ్చి చిరుచీకట్లు ముసురుతున్న వేళ రైలెక్కాను.

ఇంటికి వెళ్లేసరికి అమ్మ నా కోసం ఎదురు చూస్తోంది.

స్నానం చేసి, అమ్మ కమ్మగా వండిన భోజనం తృప్తిగా తిని, మంచం మీద వాలాను.

"బంటీ హైదరాబాద్‌లో ఉన్నాడుట్రా. ఏదో సినిమా హాల్లో బుకింగ్ క్లర్కుగా కుదిరాట్ట. మన ఊరి వాళ్లు ఒకరిద్దరు వాడిని చూసి నాతో చెప్పారు."

"మీ అమ్మ బెంగపడుతోంది. ఇంటి కోసం రమ్మంది" అని వాళ్లంటే రాను పొమ్మన్నాడట. అంతేకాకుండా పౌరుషంగా నాలుగు మాటలు కూడా అన్నాట్ట. నాకేమిటోలా ఉంది. నువ్వు వెళ్లి వాడిని ఏదో బ్రతిమిలాడి తీసుకురావాల్రా. వాణ్ని చూడాలని ఉంది" అంటూ అమ్మ కంట తడి పెట్టింది.

నాకు అమ్మను చూస్తే బాధనిపించింది.

అయితే అమ్మ చెప్పిన విషయం అంతా విన్నాక బంటి దగ్గరకు వెళ్లాలనే ఆలోచన మాత్రం విరమించుకున్నాను. ఇంతవరకూ అతిగా పట్టించుకోబట్టే వాడలా తయారయ్యాడు. సినిమా హాల్లో పనిచేస్తున్నాడు కదా! కొన్నాళ్లు వాడినలా వదిలేసి చూస్తే సరిపోతుందనిపించింది నాకు. రేపు అమ్మకు ఏదో విధంగా నచ్చజెప్పి ఇట్నుంచి ఇటే విజయవాడ వెళ్లిపోవాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాను.

తెల్లవారింది.

ఏవో కేకలు వినిపిస్తే తెలివొచ్చింది.

అమ్మ పెరట్లో ప్రహరీగోడ అవతలికి చూస్తూ "ఏం

మనుషులయ్యా! కొస్త కూడా జాలీ దయ లేవా? చిన్న కాకి పిల్లను అంత నిర్దాక్షిణ్యంగా కొట్టి చంపేస్తారా? మీకు చేతులెలా వచ్చాయి?'' అంటూ ఎవరిమీదో కేకలేస్తోంది.

నేను ఆశ్చర్యపోతూ మంచంమీంచి లేచి పెరట్లోకి వెళ్లి అమ్మను విషయం అడిగాను.

మన ఇంటి ప్రహరీగోడ మీద వాలిన కాకిపిల్లను ఎవరో గోడ అవతల్నుండి రాయితో కొట్టారట. ఎగిరే శక్తి ఇంకా పూర్తిగా రాని ఆ కాకిపిల్ల అక్కడికక్కడే చచ్చింది. వారం రోజుల నుండి ఆ కాకిపిల్ల మన పెరట్లోనే ఉంది. తల్లి కాకి ఈ వారం రోజుల్నుండి మన పెరడు వదల కుండా ఆ కాకిపిల్లకు ఏ ప్రమాదం జరక్కుండా కాపు కాసింది. పెరట్లోకి ఎవరైనా వెళ్తే చాలు గోలగోలగా అరుస్తూ ఎగురుకుంటూ వెళ్లి అటువెళ్లిన వాళ్ల నెత్తిన కాళ్లతో తన్నేది. ఈ రెండు రోజుల్నుండి పిల్లకాకికి రెక్కల్లో కాస్త శక్తి వచ్చింది. అటు ఇటూ కొద్దిగా ఎగురుతూ ఈ రోజు ఉదయమే ఆ ప్రహరీ గోడ మీద వాలింది. ఇంత లోనే వాళ్లెవరో కొట్టి చంపేశారు. తల్లికాకి ఇంతవరకూ ఇక్కడే ఉండి ఇప్పుడే ఎటో ఎగిరిపోయింది. వారం రోజుల పాటు ఎంతో శ్రద్ధతో తన పిల్లకు ఏ ప్రమాదం జరక్కుండా కాపు కాసుక్కూర్చున్న ఆ తల్లికాకి మరో రెండు రోజులు జాగ్రత్తపడితే బాగుండేది. పిల్లకాకికి రెక్కలబలం పూర్తిగా వచ్చుంటే, ఆ వెధవలెవరో కొట్టిన దెబ్బకు దొర క్కుండా ఎగిరి వెళ్లిపోయి ఉండేది. దాని ప్రాణం అది రక్షించుకోగలిగేది'' అంటూ చెప్పుకొచ్చింది అమ్మ.

నేను ఆలోచనలో పడ్డాను.

కాకిపిల్ల విషయంలో ఏదో సరికొత్త వాస్తవం అవగతం అయినట్లనిపించింది. వెంటనే బంటి గుర్తొచ్చాడు.

వారం రోజులపాటు తల్లికాకి పిల్లకాకి రక్షణ గురించి కాపుకాసినట్లే అమ్మా నాన్నా చిన్నప్పట్నుంచీ బంటీని చాలా గారాబంగా పెంచారు. పిల్లకాకికి కాస్త రెక్కల బలం వచ్చినట్లే బంటీ ఇప్పుడే సంపాదనలో పడ్డాడు. ఇంకా స్థిరత్వం, ఆలోచనలో పరిణతి పెరగాలి. తల్లికాకి మరో రెండు రోజులు జాగ్రత్తపడితే బాగుండునట్లే బంటీ విషయంలో నేనూ, అమ్మా మరికొద్ది రోజులు జాగ్రత్త పడాలి. పిల్లకాకికి రెక్కల బలం పెరిగితే ప్రమాదం నుండి తప్పించుకోగలిగినట్లే. బంటీ ఆలోచనల్లో పరిణతి, సంపా దనలో స్థిరత్వం వస్తే జీవితంలో తన కాళ్ల మీద తాను బత గ్గలడు.

బంటీ పట్ల నా నిర్లక్ష్యం ఎంత తప్పో కాకిపిల్ల గురించి అమ్మ చెప్పిన మాటల్ని బంటీ గాడి పరిస్థితితో సరిపోల్చి చూస్తే నాకర్థమైంది.

సినిమా హాల్లో పని చేస్తున్నాడు కదా! కొన్నాళ్లు వాడి నలా వదిలేస్తే సరిపోతుంది అన్న నా నిర్లక్ష్యం, అశ్రద్ధ ఆవే శపడి ఇంట్లోంచి అలిగి వెళ్లిపోయిన బంటీని మరింతగా చెడగొడుతుంది. మంచీ చెడూ చెప్పే వాళ్లు లేక వాడు మరింత పతన స్థితికి దిగజారిపోయే అవకాశం ఉంది.

ఆ ఆలోచన కలిగిన వెంటనే నేను హైదరాబాద్ వెళ్లి బంటీని కలిసి రావాలని నిశ్చయించుకున్నాను. అక్క డ్నుంచి వాడిని తీసుకు వచ్చేద్దామని కాదు. వాడి మంచీ చెడ్డా తెలుసుకొని అవసరమైన సహాయ సహకారాలు అందిద్దామని. ఎందుకంటే! గతంలో అమ్మానాన్నలు వాడి పట్ల చూపించిన అతిగారాబం ఎంత తప్పో! ఇప్పుడు వాడి పట్ల నేను చూపిస్తున్న నిర్లక్ష్యం కూడా అంతే తప్పని అవగతం అయింది కాబట్టి.

**-కె.నాగేశ్వరరావు**
**(విజయవాడ)**

# లిఫ్ట్!

'బంద్' కారణంగా నగర వీధులన్నీ బోసిపో తున్నాయి. ట్రాఫిక్ చాలా పల్చగా ఉంది. అడపాదడపా ఒకటీ అరా మోటార్ సైకిళ్లు, ఆటోలు తప్ప రోడ్డు మీద మరెలాంటి అలికిడీ లేదు.

రోడ్డు వారగా నిలబడిన ఓ అమ్మాయి లిఫ్ట్ కావాలన్న ట్లుగా చేయెత్తి బొటనవ్రేలు చూపడంతో సర్వేశ్వరరావు మోటార్ బైక్‌కి సడన్ బ్రేక్ వేశాడు.

తీరా చూస్తే ఆమె ఎవరో కాదు. తమ వీధిలో ఉండే లోకేశ్వరరావు చెల్లెలే. సర్వేశ్వరరావుకి లోకేశ్వర రావుతో పెద్దగా పరిచయం లేకున్నా కొంచెం ముఖప రిచయం మాత్రం ఉంది.

చిరునవ్వుతో వచ్చి మోటార్ బైక్ ఎక్కింది అనిల.

అందమైన అలాంటి ఆడపిల్లకి లిఫ్ట్ ఇచ్చే అదృష్టం తనకి దొరికినందుకు సంబరపడిపోయాడు సర్వేశ్వరరావు. అతని మనసులో కించిత్ గర్వం కూడా తొంగిచూసింది.

"ఏమండీ 'బంద్' కదా ఇవ్వాళ ఇంట్లో రెస్ట్ తీసు కోవాల్సింది." మోటార్ బైక్ ముందుకు దూకిస్తూ అన్నాడు సర్వేశ్వరరావు.

"ఇమ్మీడియట్‌గా కొన్ని ఇంపార్టెంట్ ఫైల్స్ పూర్తి చేయాలని బాస్ ఆర్డర్! దాంతో రాక తప్పలేదండి" అంది అనిల.

"ఏం బాసులోనండీ! మన కష్టసుఖాలు పట్టించు కోరు గదా!" సానుభూతిగా అన్నాడు సర్వేశ్వరరావు.

"బస్సులు లేకపోవడంతో ఉదయం రావడం కూడా చాలా ఇబ్బందయిందండి."

"కాదు మరి.." ఒప్పుకుంటున్నట్లన్నాడతను.

"ఆటో అంటే కూడా భయంగా ఉందండి. మీటర్ మీద ఇరవై పాతికా ఇమ్మంటున్నారు."

"అవునవును... ఇలాంటి బంద్ రోజుల్లో అయితే మరింత డిమాండ్ చేస్తారు వాళ్లు."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఎలాగైనా ఆ పరిచయాన్ని మరింత పెంచుకొని ఆమెకు చేరువ కావాలని సర్వేశ్వరరావు ఉద్దేశం. అందుకే తనే మళ్లీ, "పోనీ ఈ పూట మీ బ్రదర్ని స్కూటర్ తీసుకు



నైనా రమ్మని చెప్పాల్సింది" అన్నాడు సంభాషణ పొడి గిస్తూ.

"ఆ అది మాత్రం ఏం సుఖంలెండి? పెట్రోలు ధరలు మాత్రం మండిపోవడం లేదూ?' అందామె నిన్పు హగా.

"నిజమే. అలా అని నడిచిపోలేం కదండీ?'

"కనీసం మీ బ్రదరన్నా ఆఫీసు వదిలే సమయానికి వెహికల్ తీసుకొస్తే మీక్కాస్త శ్రమ తప్పేది".

"ఇందులో శ్రమ ఏముందిలెండి?"

"అదేం మాట? అదే నేనైతే మీ అన్నయ్యలా ఉదాసీ నంగా వదిలేసి ఊరుకునే వాణ్ణి మాత్రం కాదు" గొప్ప విశాల హృదయుడినని నిరూపించుకోడానికి తెగ తాప త్రయ పడిపోయాడు సర్వేశ్వరరావు.

''వాడు వస్తాననే చెప్పాడండీ. కానీ నేనే వద్ద న్నాను.''

''అదేం''

''ఓ ప్రక్క పెట్రోలు దొరక్క చస్తుంటే 'బంద్' నాడు కూడా తిరిగి దాన్ని వేస్ట్ చేయడం తెలివితక్కువ కాదంటారా? చెప్పండి?''

''అవునవును. మీ 'థింకింగ్ ఆఫ్ ఎకానమీ' అమోఘం'' మెచ్చుకోబోయాడు సర్వేశ్వర రావు.

''అందుకే ఎవడో ఒక తలమాసిన వెధవ లిఫ్ట్ ఇవ్వకపోడులే అని వాడికి నచ్చచెప్పి వచ్చేశా నండీ''

సర్వేశ్వరరావు బుర్ర తిరిగిపోయింది. ఠక్కున బండి ఆపేశాడు. అనిల మోటార్ బైక్ దిగి ''నేననుకున్నట్లే అంతలో మీరొనే వచ్చారు. చాలా థాంక్స్ అండీ ఇదే మా ఇల్లు. రండి మా అన్నయ్యకి పరిచయం చేస్తాను'' అంటూ గేటు తీసింది.

తర్వాత ఆమె వెనక్కి తిరిగి చూసేసరికి అక్కడ సర్వేశ్వరరావుకనిపించలేదు.

**-బద్దిగం పాండురంగారెడ్డి (జగిత్యాల)**